# అధిష్ఠానం నిర్ణయం మేరకు కమిటీలను ప్రకటిస్తాం

## ఏర్గట్ల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శివన్నోళ్ల శివకుమార్

## గుమ్మిర్యాల్, నాగేంద్రనగర్ గ్రామాల్లో కాంగ్రెస్ కార్యకర్తల సమావేశాలు

ఏర్గట్ల, బతుకమ్మ : గ్రామ కాంగ్రెస్ కమిటీలు, మండల కాంగ్రెస్ కమిటీలు, యూత్ కాంగ్రెస్ కమిటీ ల ఏర్పాటుపై స్థానిక నాయకులు, కార్యకర్తల అభిప్రాయాలను సేకరించి పార్టీ అధిష్ఠానానికి పంపిస్తామని, వారి నిర్ణయం మేరకు కమిటీలను ప్రకటిస్తామని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శివన్నోళ్ళ శివకుమార్ తెలిపారు. ఆయన అధ్యక్షతన మండలంలోని గుమ్మిర్యాల్, నాగేంద్రనగర్ గ్రామా ల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ మండలంలో ప్రస్తుతం ఎరువుల కొరత లేదని, రైతుల అవసరాలకు అనుగుణంగా ప్రభుత్వం ముంద స్తుగా ఎరువుల కేటాయింపులు చేసిందని వివరించారు. గ్రామాల వారీగా రైతులు యాప్ ద్వారా బుకింగ్ చేసుకుని, సొసైటీలలో చెల్లింపులు పూర్తి చేసిన వెంటనే యూరియా అందుబాటులోకి వస్తుం దని తెలిపారు. కొన్ని సొసైటీలు గతంలో అప్పులు చేసి డిఫాల్ట్ అయిన నేపథ్యంలో రైతులు సమయానికి చెల్లింపులు చేయక పోయినా ప్రభుత్వాన్ని విమర్శించడం సరికాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల అవసరాలకు అనుగుణంగా ఎరువులను పంపిణీ చేస్తోందని, యాప్ విధానం తెలంగాణలోనే కాకుండా ఇతర రాష్ట్రాల్లో కూడా అమల్లో ఉందని పేర్కొన్నారు. ఎరువుల దళారీ వ్యవస్థను నిర్మూ లించి ప్రతి రైతుకు సమానంగా ఎరువులు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. ప్రతిపక్షాలు రైతులను తప్పుదారి పట్టిస్తూ అయోమయానికి గురిచేస్తున్నాయని ఆరోపించారు. గత బీఆర్ఎస్ పాలనలో రైతులు ఎరువుల కోసం గంటల తరబడి, రోజుల తరబడి క్యూలలో నిలబడిన పరిస్థితులను గుర్తు చేశారు. ప్రస్తుతం అమలులో ఉన్న యాప్ విధానంలో కొన్ని సాంకేతిక సమస్యలు ఉన్నప్పటికీ వాటిని ప్రభుత్వం దశలవారీగా సరిదిద్దుతోందని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజాపాలన ప్రభుత్వం ప్రతి రైతుకు సులభంగా ఎరువులు అందేలా కృషి చేస్తోందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు అవసరమైన మేర ఎరువులు సరఫరా చేయకపోవడం వల్లే సమస్యలు తలెత్తుతున్నాయని విమర్శించారు. అలాగే ఎరువుల ధరలు, డీజిల్, పెట్రోల్ ధరలను కేంద్ర ప్రభుత్వం పెంచడం వల్ల రైతులతో పాటు పేద, మధ్యతరగతి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. క్రూడ్ ఆయిల్ ధరలు తగ్గిన నేపథ్యంలో డీజిల్, పెట్రోల్ ధరలను కూడా తగ్గించాలని కాంగ్రెస్ పార్టీ తరఫున డిమాండ్ చేశారు. ఈ సమావేశాల్లో గుమ్మిర్యాల్ సర్పంచ్ దేశబోయిన జమున సంజీవ్ యాదవ్, తోర్తి గ్రామ సర్పంచ్ కౌడ భూమేశ్వర్, నాగేంద్రనగర్ సర్పంచ్ సందే రంజిత్, ఉపసర్పంచ్‌లు కిషోర్, సుమన్ గౌడ్, షేక్ జాకీర్, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోర్తి గంగామోహన్, ఏనెండ్ల రాకేష్, కాటిపల్లి రఘుపతి, షెంసన్, ముక్కెర గజేందర్ యాదవ్, అనిల్ యాదవ్,



కాటిపల్లి దేవన్న, పన్నాల నర్సారెడ్డి, కమ్మరి హరీష్, గంగ భూమన్న, ఇనర్ల శ్రీనివాస్, కమ్మరి ముత్తెన్న, సోమ రాకేష్, భార్గవ్, వకీల్, బోడరాజ్, రవి గౌడ్, మల్లేష్, బోడ గణేష్, కుశ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# ఏ ఊరు బస్టాండో ఇది ?

## ఈ బస్టాండుకు పేరేమిటో ?

## బస్టాండ్ పేరు తెలియక దూర ప్రాంతపు ప్రయాణికుల ఆందోళన

## బస్టాండు ప్రాంగణం పేరు రాయడం పట్ల ఆర్టీసీ అధికారుల నిర్లక్ష్యం

## నూతన సర్పంచులు వచ్చిన బస్టాండ్ కు పేరు మోక్షం కలగడం లేదు

## సరిహద్దు కారణాలే శాపమా ?







ఇందల్వాయి, బతుకమ్మ :ఇందల్వాయి మండల కేంద్రంలోని ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణం బస్టాండుకు గత కొన్ని సంవత్సరాలుగా పేరు లేకపోవడం పట్ల దూర ప్రాంతాల నుండి ఇందల్వాయి వచ్చే ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. ఇందల్వాయి టికెట్ తీసుకొని బస్సులో ప్రయాణం చేస్తున్నప్పటికీ బస్టాండుకు పేరు లేకపోవడంతో ఇది ఏ ఊరు బస్టాండోనని ఆందోళన చెందుతున్నారు. ఇందల్వాయి ఆర్టీసీ బస్టాండ్ కు గత కొన్ని సంవత్సరాలుగా పేరు లేకపోవడం పట్ల ప్రయాణిక ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. నూతనంగా సర్పంచులు వచ్చినప్పటికీ సరిహద్దు సాగుతో ఎవరు పట్టించుకోవడం లేదని ప్రజలు చర్చించుకుంటున్నారు. బస్టాండ్ ప్రయాణ ప్రాంగణానికి పేరు ఉంటేనే గుర్తుతెలియని ప్రయాణిక ప్రజలు బస్టాండ్ కు రాసి ఉన్న పేరును చూసి పలాన ఊరు ఇందల్వాయి బస్టాండ్ అని పేరు చూసి స్టేజి అని తెలుసుకోవడం జరుగుతుందని తెలుపుతున్నారు. కానీ దీనికి విరుద్ధంగా ఆర్టీసీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ఇప్పటివరకు ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణానికి ఇందల్వాయి ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణం అనే పేరును ఇప్పటికీ రాయించకపోవడం విశేషం. దీంతో ఏ ఊరు బస్టాండో అనే ప్రశ్నకు ఆర్టీసీ యాజమాన్యం స్పందించి, తేరుకొని ఇందల్వాయి ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణానికి పేరు రాయాలని ప్రయాణిక ప్రజలు కోరుతున్నారు. స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి చొరవ తీసుకొని సరిహద్దు వివాహాన్ని పరిష్కరించి బస్టాండ్ పేరు రాయించేలా ఆర్టీసీ సిబ్బందికి సూచించాలన్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ యాజమాన్యం, ఇందల్వాయి బస్టాండ్ కు పేరు రాయించడం పైన స్పందిస్తుందో లేదో వేచి చూడాల్సిందే.

# కుళ్ళిన మాంసం విక్రయాల జోరు..!

## ప్రజల ఆరోగ్యాల బేజారు..!

## ప్రజల నుండి భారీగా డబ్బులు దండుకుంటున్న వ్యాపారులు

## షాప్ యజమానులను పట్టించుకోని ఫుడ్ ఇన్స్పెక్టర్లు

## జిల్లా డిఎంహెచ్ఓ పర్యవేక్షణ లోపం

## మామూళ్లు ఘణం..తనిఖీలు శూన్యం

ఇందల్వాయి, బతుకమ్మ :ఇందల్వాయి మండల కేంద్రంలో చికెన్, మటన్ అమ్మే వ్యాపారులు వివిధ రోగాలతో చనిపోయిన మేకలను ఫ్రిజ్ లో పెట్టి మరునాడు దుకాణం షాపుకు తీసుకొచ్చి గుట్టు చప్పుడు కాకుండా అమ్ముతున్నారు. మటన్ షాప్ యజమానులు ప్రజలకు మాయమాటలు చెప్పి కుళ్ళిన మాంసాన్ని విక్రయిస్తున్నారు. దీంతో ప్రజలు అనారోగ్యాల పాలవుతున్నారు. ఇంటికి షాపు నుండి తీసుకెళ్లిన మాంసాన్ని(మటన్) వండుకుని తినడంతో మోషన్స్, దగ్గు, దమ్ము, నరాల బలహీనత, అనారోగ్యం పాలవుతుండడం వంటివి జరుగుతున్నాయి. మటన్ షాపు యజమానులు ప్రజల నుండి భారీగా డబ్బులు దండుకోవడమే పనిగా పెట్టుకొని కుళ్ళిన మాంసంతో మూడు పువ్వులు ఆరు కాయలు అన్న చందంగా దర్జాగా విక్రయాలు చేస్తున్నారు. మండల కేంద్రంలో ఇప్పటివరకు జిల్లా అధికార డిఎంహెచ్వో పర్యవేక్షణ సందర్భాలు లేవు. దీనికి తోడు ఫుడ్ ఇన్స్ పెక్టర్ లు నామమాత్రంగా తనిఖీలు చేయడము పట్ల ప్రజల నుండి భారీగా విమర్శలున్నాయి. దీనికి కారణం మామూళ్ల పరంపర కొనసాగుతుండడమే కారణమా అని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికార డిఎంహెచ్వో యంత్రాంగం, ఫుడ్ ఇన్స్ పెక్టర్ లు తేరుకొని కుళ్లిన మాంసాలను అమ్ముతున్న షాపులను తనిఖీ చేసి షాప్ యజమానుల పైన కఠిన చర్యలు తీసుకొని ప్రజల ఆరోగ్యాలని కాపాడాలని కోరుతున్నారు. ఇప్పటికైనా ప్రజలు అనారోగ్యాల పాలు కాకుండా ఫుడ్ ఇన్స్ పెక్టర్ లు షాపులను ఎప్పటికప్పుడు తనిఖీలు చేస్తూ ప్రజల ఆరోగ్యాలను కాపాడతారని ఆశిద్దాం. మరి జిల్లా అధికారులు తేరుకుంటారో లేదో.. లేదా మామూళ్ల మత్తులోనే ఉంటారో వేచి చూడాల్సిందే.

# నేటి నుంచి జరిగే బిఎల్ఓల సర్వేకు సర్వం సిద్ధం

ఇందల్వాయి, బతుకమ్మ :ఇందల్వాయి మండలంలోని వివిధ గ్రామాలలో నిర్వహించే బిఎల్ఓ ల స్పెషల్ ఇంటెన్స్ రివిజన్ ఇన్ఫర్మేషన్ సంబంధించిన పత్రాలను స్థానిక తహసిల్దార్ బాలయ్య బుధవారం అందజేశారు. మండలంలోని 39 పోలింగ్ కేంద్రాలకు గాను 12 రకాల ఈ ఎఫ్ పారాలను సంబంధిత బి ఎల్ వో లకు అందజేయడం జరిగిందని ఆయన వివరించారు. నేటి నుండి బిఎల్వోలు ఇంటింటి సర్వే నిర్వహించి సార్ కార్యక్రమాన్ని దిగ్విజయం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తాసిల్దార్ శైలజ, రెవిన్యూ ఇన్స్పెక్టర్ గిరిధర్, ప్రవీణ్ కుమార్, జి పి ఓ లు, బిఎల్వోలు పాల్గొన్నారు

